క్లుప్తంగా

గ్రామీణ వైద్య సంక్షేమ సంఘ కార్యవర్గానికి అభినందన

గుడివాడ టౌన్: గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ అభినందన సభ బుధవారం స్థానిక పామర్రు రోడ్డులోని ఓ ప్రైవేట్ వైద్యశాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్. ఉదయ భాస్కర రాజు, ప్రధాన కార్యదర్శి డివి నాగేశ్వరరావు, కార్యదర్శులు పి. సింహాచలం, జీఎస్ చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాస్, సలహా మండలి చైర్మన్ కె. వెంకటేశ్వరరావు, క్రమ శిక్షణ కమిటీ వైస్ చైర్మన్ వి.ఎం. ధన్వంతరి, కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రదీప్ కుమార్, పి.అశోక్‌ను జిల్లా సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు ఎ. ఫణిగోపాల్, జి. చంటి, సీహెచ్ చంద్రశేఖర్, లాల్ అహ్మద్, బి. రాజు, వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

కేటీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



గుడివాడ టౌన్: స్థానిక కేటీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుష్మ డాక్టరేట్ సాధించారు. బుధవారం కళాశాల యాజమాన్యం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి. నిర్మల మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జువాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఫిషరీస్ అంశంపై చేసిన పరిశోధనలో సుష్మ డాక్టరేట్ సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. శైలజ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్న పాదాల చెంతకు కాలినడకన భక్తులు

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు 60 కిలోమీటర్ల నుంచి 16మంది భక్తులు కాలినడకన వచ్చారు. రెండు రోజులుగా నడుస్తూ.. బుధవారానికి స్వామివారి చెంతకు చేరారు. భక్తుల తాకిడి అధికమవుతున్న ఈ ఆలయానికి బాపులపాడు మండలం అంపాపురం నుంచి ఈ భక్తులు నడుస్తూ వచ్చారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అట్లూరి ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు: శేరీ కల్వపూడి పీఏసీఎస్ చైర్మన్‌గా అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్‌తో పాటు డైరెక్టర్లుగా వెంకటేశ్వరరావు, అనురాధ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. జెడ్పీటీసీ మాజీ కొసరాజు బాపయ్య చౌదరి, మాజీ సర్పంచ్ రామరాజు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, ఈడె మోహన్, పోలవరపు వెంకట్రావు పాల్గొన్నారు.

త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు: చంద్రాల పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ చైర్మన్‌గా జొన్నలగడ్డ సహదేవుడు, సభ్యులు రేమల్లి రేషయ్య, పోలగాని వీర రామ్మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.

శ్రీ లక్ష్మీ గణపతిగా స్వామి దర్శనం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం 8వ రోజు స్వామిని శ్రీ లక్ష్మీ గణపతిగా అలంకరించి దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు జరుగుచున్న నేపథ్యంలో 151 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. లోక కల్యాణార్థం పట్టణ ప్రజల సంక్షేమానికి ఈ హోమం నిర్వహించామని పేర్కొన్నారు.

6న లడ్డూ ప్రసాదం వేలం

నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులు సమర్పించుకున్న ప్రసాదం లడ్డూను శనివారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని ఈఓ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం స్వామి వారి నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం మూడు గంటలకు నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

పల్లెకు జ్వరమొచ్చింది!

గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు



కపిలేశ్వరపురం పీహెచ్‌సీలో జ్వరంతో వచ్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు బాలాజీ

పమిడిముక్కల: మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వాతావరణ మార్పులు, అధిక వర్షాలు, అపరిశుభ్రత, దోమల వ్యాప్తితో వైరల్ ఫీవర్స్ వస్తున్నాయి. పలువురు జ్వరం, జలుబు, దగ్గుతో పడకేస్తున్నారు. పీహెచ్‌సీలు, ఆర్ఎంపీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వైరల్ ఫీవర్ వస్తే వారం రోజుల వరకు తగ్గడం లేదని బాధితులు చెబుతున్నారు. చోరగుడి శివారు గోపాలకృష్ణాపురం, దళితవాడ, కృష్ణాపురం శివారు గ్రామాలైన కొత్త దళితవాడ, ముసలనాయికపాలెం, లంకపల్లి శివారు అప్పారావు పేట, గురజాడ, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు.

జ్వరంతో వస్తే రక్త పరీక్షలు

విద్యార్థులు జ్వరం, జలుబు, దగ్గుతో పాఠశాలలకు రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. జ్వరాలతో వచ్చే వారికి రక్తపరీక్షలు చేస్తున్నామని, ఇబ్బందేమీ లేదని, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని కపిలేశ్వరపురం పీహెచ్‌సీ వైద్యులు బాలాజీ తెలిపారు. ఓపీ రోజుకు 65 మంది వస్తుంటే.. వారిలో 20 మంది జ్వరంతో వస్తున్నారని పేర్కొన్నారు.

జ్వరం, తలనొప్పితో ఇబ్బంది



మూడు రోజులుగా జ్వరం, తలనొప్పి, గొంతునొప్పితో బాధపడుతున్నాను. మందులు వాడితో జ్వరం తగ్గుతోంది. వాటిని ఆపేస్తే మళ్లీ వస్తోంది. కపిలేశ్వరపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాను.
– కె.భవిత, విద్యార్థిని, కపిలేశ్వరపురం

జ్వరం, నీరసం



జ్వరం, నడుమునొప్పితో ఇబ్బంది పడుతున్నాను. జ్వరం తగ్గి మళ్లీ వస్తోంది. దీంతో నీరసంగా ఉంటోంది. కపిలేశ్వరపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాను.
– సీహెచ్ లక్ష్మి, తాడంకి

దోమల నివారణకు గ్రామాల్లో ఎబెట్ మందు స్ప్రే చేయిస్తున్నామని చెప్పారు. కాగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేయాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

కలిదిండి (కైకలూరు): ఇరిగేషన్ భూముల్లో తరతరాలుగా నివాసం ఉంటున్న పేదలకు జీఓ నంబర్ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలిదిండి ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం 7వ మండల మహాసభ ఎస్ఎన్‌వీ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల పైబడి నివాసం ఉంటున్న వారికి భూమిపై హక్కు కల్పించకపోవడం అన్యాయమన్నారు. పంట కాలువకు, ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇబ్బంది లేకుండా నివాసం ఉంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కలిదిండి ప్రాంతం చేపలు, రొయ్యలు చెరువులుగా మారడంతో కూలీలకు ఉపాధి కరువైందన్నారు. ప్రధానంగా మహిళలు వ్యవసాయ కార్మిక వృద్ధులు పనులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో 200 రోజులు ఉపాధి పని కల్పించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు అక్టోబర్ 27, 28 తేదీల్లో కలిదిండిలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. చేపలు, రొయ్యల పట్టుబడి శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులు కల్పించాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో శుద్ధిచేసిన మంచినీళ్ల సరఫరా చేయాలని, రోడ్లను బాగు చేయాలని మహాసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సీహెచ్.సత్యనారాయణ, జమ్మ దుర్గ, కటారి వెంకమ్మ, పతివాడ కనకదుర్గ, ప్రజా నాయకులు జక్కుల మహేష్, వి భాస్కరరావు, డీవీ.సత్యనారాయణ, సీహెచ్.శ్రీకాంత్, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మండవల్లి: 2025–26 సంవత్సరానికి 10 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓ సీహెచ్ వీఎం సురేష్ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని అన్ని యూనియన్‌ల ప్రతినిధులతో, సీనియర్ ఉపాధ్యాయులతో సమావేశమై వీరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీపీ పాఠశాలలకు చెందిన ఎస్ స్వర్ణకుమారి (పెనుమాకలంక), ఎస్‌కే మున్నీసా (లోకుమూడి మెయిన్), సీహెచ్ అన్నామణి, ఆశీర్వాదం (దెయ్యంపాడు), వి స్వరాజ్యలక్ష్మి (మండవల్లి), ఎన్ అమ్మాజి (అల్లినగరం), వి ఉదయతార (పసలపూడి), డి భూషణం (కె పెరికెగూడెం), ఎస్ భారతీదేవి (మూలపేట), జి రమ (శోభనాద్రిపురం), ఎస్ పుష్పలత (పెరికెగూడెం) ఎపికైనట్లు ఎంఈఓ తెలిపారు.

సమస్యలపై పోరాటం

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటం ఏపీటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘ నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులతో ఎదురవుతున్న సమస్యల గురించి తరచూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.జాన్సన్ బాబు, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పమిడిముక్కల: స్థానిక శ్రీ పార్వతీశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గం సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ సభ్యులు యలవర్తి రాఘవేంద్ర వరప్రసాద్, కోగంటి శ్రీహరి, కాటూరి విజయలక్ష్మి, ఆముదాలపల్లి ధనలక్ష్మి, నాగమణి, పసుమర్తి అంజలి, వెణుతురుమిల్లి హైమావతి, బోలెం వెంకట నాగజ్యోతి, అర్చకుడు లంకా వంశీ శర్మలచేత ఆలయ ఈఓ సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేయించారు.

రామాలయ చైర్మన్‌గా రాజబాబు

గుడ్లవల్లేరు: అంగలూరు శ్రీ రామాలయ కమిటీ చైర్మన్‌గా తిపిర్నేని రాజబాబును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియమించారు. బుధవారం చైర్మన్ రాజబాబుతో పాటు సభ్యులు బొప్పన వెంకట సత్య నాగభూషణం, కె.కోటేశ్వరరావు, కందుల ఏడుకొండలు, త్రిపురనేని మాలతి, లోయ వీర వెంకట వరలక్ష్మి, చప్పిడి వీరమ్మ, పలగాని మహాలక్ష్మికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. .

దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: 2025–28సంవత్సరాలకుగాను మిగిలిన బార్ల కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ బుధవారం తెలిపారు. గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ మున్సిపాలిటీలో 11బార్‌లు కేటాయించగా దీనిలో ఒక బార్ కల్లుగీత కార్మికులకు చేయించినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్‌తో పాటు మరో నాలుగు బార్లను లాటరీ విధానం ద్వారా కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన ఆరు బార్లకు ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. బార్‌ల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో హైబ్రిడ్ మోడల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి దరఖాస్తునకు నాన్ రీఫండబుల్ రుసుం కింద రూ.5లక్షలు, అప్లికేషన్ ఫీజు కింద రూ.10వేలు చెల్లించాలని పేర్కొన్నారు. ఒక బార్‌కు తప్పనిసరిగా నాలుగు అప్లికేషన్‌లు వస్తేనే డ్రా తీస్తామని తెలిపారు. 15వ తేదీన డ్రా తీసి బార్‌లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ కోరారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

గుడ్లవల్లేరు: అంగలూరులో ఇటీవల నిర్మించిన రైతు సేవా కేంద్ర భవనాన్ని బుధవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, కూటమి నాయకులు వల్లభనేని వెంకట్రావు, కొడాలి రామరాజు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, ఈడె మోహన్, డోకిపర్రు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు శివప్రసాద్, వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బందికి శిక్షణ

కైకలూరు: స్వమిత్వ సర్వేపై సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందికి శిక్షణ కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. స్వమిత్వ రెండో విడతలో మండలంలో 17 గ్రామాలు ఎంపికయ్యాయి. ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ శిక్షణ అందించారు. డీఎల్‌డీఓ లక్ష్మీ, డెప్యూటీ ఎంపీడీఓ కిరణ్, కార్యాలయ ఏఓ బాలశేఖర్ పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు అగ్నాస్త్రం

మండవల్లి: కాండం తొలుచు పురుగు నివారణకు అగ్నాస్త్రం ఉపయుక్తంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. అల్లినగరం గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడారు. వేపాకు, జిల్లేడు, ఉమ్మెత్త, పుగాకు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఆవు మూత్రంలో వేసి బాగా మరిగించి తయారు చేసిన అగ్నాస్త్రం వరి పైరుకు 3 లీటర్లను 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంపై పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ అభినందనీయం



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినుల ప్రతిభ అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిన హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులను బుధవారం ఎమ్మెల్యే రాము అభినందించారు. హైస్కూల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు 74 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం జగన్మోహనరావు ఎమ్మెల్యేకు తెలిపారు. వీరిలో 71మందికి ఫస్ట్ క్లాస్ వచ్చినట్లు పేర్కొన్నారు. 571మార్కులతో కతిజ తెహరా అనే విద్యార్థిని షైనింగ్ స్టార్ అవార్డు సాధించినట్లు చెప్పారు. పురిటిపాడుకు చెందిన గురువు ముక్కు సోమేశ్వరరావు తన శిష్యులు బాలికలతో కర్రసాము ప్రదర్శింపజేసి ఎమ్మెల్యే రాము నుంచి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావును ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఎంఈఓ గోపాలరావు, డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పి.వినయ్ కుమార్, సర్పంచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయాభివృద్ధికి రూ.55,116 విరాళం

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు ముత్తిరెడ్డి మల్లేశ్వరరావు స్మారకార్థం కుమారుడు శ్రీనివాసరావు రూ.55,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు బుధవారం అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని కృష్ణప్రసాద్, ఆలయ ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

ముదినేపల్లి రూరల్: స్థానిక వికాస్ జూనియర్, విద్యాంజలి డిగ్రీ కళాశాల్లో ఫ్రెషర్స్‌డే బుధవారం ఉల్లాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కోకో కార్యదర్శి మడకా ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత అధ్యాపకుడు కోడూరు అచ్చయ్య చౌదరి, కరస్పాండెంట్ గోకవరపు మదనకిషోర్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, నక్కా కనకమోహనరావు, అధ్యాపకులు ఒత్తూరు వెంకటసుబ్బారావు, విజయకుమార్ పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ స్కానర్‌ను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు కుచ్చుటోపీ

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

యలకుర్రు(మొవ్వ): సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం కుచ్చుటోపీ పెట్టిందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పామర్రు మండలం యలకుర్రు గ్రామంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ నాయకులు వెళ్లారు. వైఎస్సార్ సీపీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాల గురించి తెలుసుకోవాలని కైలే అనిల్‌కుమార్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలతో సహా వందకు పైగా హామీలను ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఏ ఒక్క పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాల ద్వారా మహిళను మోసం చేశారన్నారు. కుల, మత, పార్టీ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అనంతరం గ్రామ నాయకులతోను కార్యకర్తలతో చర్చించి గ్రామ పార్టీ కమిటీని ఏర్పాటు చేశారు.



ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమళ్ల రమాదేవి, యలకుర్రు సర్పంచ్ పానే మస్తాన్, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రత్నకుమారి, మండల ప్రధాన కారుదర్శి పెయ్యల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యలకుర్రు గ్రామ కమిటీ ఎన్నిక

పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో యలకుర్రు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పానే కొండలరావు, ప్రధాన కార్యదర్శులుగా బడుగు నాగరాజు, దండాబత్తిన నాగరాజు, కొనకాళ్ల వెంకట్రావు, పానే సాయిబాబు, కార్యదర్శులుగా గొపర్ల వెంకటేశ్వరరావు, పెదపూడి వెంకటేశ్వరరావు, మేకల నాగేశ్వరరావు, అచ్చన రామకృష్ణను ఎన్నుకున్నారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

పమిడిముక్కల: రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. అదను దాటిపోతుండటంతో యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. పీఏసీఎస్‌ల్లో యూరియా అందుబాటులో లేకపోడంతో వీరంకిలాకులోని గ్రోమోర్ వద్ద బుధవారం రైతులు బారులు తీరారు. గ్రోమోర్‌కు 19.80 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, రైతులకు పొలం విస్తీర్ణం, ఆధార్ కార్డు ఆధారంగా పంపిణీ చేస్తున్నట్లు ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. కాగా యూరియా కోసం షాపుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, సొసైటీల్లో అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

అన్ని సొసైటీలకు పుష్కలంగా ఎరువులు

పామర్రు(మొవ్వ): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శనివారం లోపు అన్ని సొసైటీల్లో పుష్కలంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని వ్యవసాయ అధికారి శివనాగరాణి బుధవారం తెలిపారు. మన గ్రోమోర్ దుకాణానికి 24 టన్నులు యూరియా వచ్చిందని, మండల పరిధిలోని 495 మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క యూరియా కట్టను అందించడం జరిగిందని తెలిపారు.



వీరంకిలాకు గ్రోమోర్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై



గుడ్లవల్లేరులో వినాయకుని నిమజ్జనోత్సవ ఊరేగింపు



కైకలూరులో వినాయక నిమజ్జన ఊరేగింపులో యువత డ్యాన్స్



గుడ్లవల్లేరులో లడ్డూ ప్రసాదాలను వేలం పాటల్లో సొంతం చేసుకున్న భక్తులు

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాల వినాయక కమిటీ వారు స్వామిని తీన్‌మార్ డప్పులు, బాణసంచా పేలుస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. స్వామితో పాటు మహిళా భక్తులు, చిన్నారులు 'జై బోలో గణేష మహరాజ్‌కీ జై' అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు బుజ్జి బుజ్జి వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు రావటం ఆకర్షణీయంగా మారింది. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ మోటార్స్ అధినేత సీహెచ్.ఉపేంద్ర, స్వాతి దంపతులు, అయికా రమాదేవి, పవన్ చైతన్య, సూరిబాబు, ఆంజనేయులు, మహాలక్ష్మి దంపతులు, దుర్గ, మహేష్, బాలయ్య, అజయ్, నందు, భువన, భాను, నాగపోతరావు, మోహన్, ఉషా పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని శ్రీహరిపురంలో అర్చకుడు ఆసూరీ రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో గణపతి విగ్రహానికి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అబ్బిశెట్టి నాగబాబు పాల్గొన్నారు. గురజలో గౌడబజారులో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

కైకలూరులో..

కైకలూరు: ఉండ్రాలయ్యా... వెళ్లి మళ్లీ ఏడాదికి రావయ్యా.. అంటూ యువత ఉత్సాహంగా వినాయక విగ్రహాల నిమజ్జనాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్నసమారాధనలు, విగ్రహాల ఊరేగింపులు బుధవారం ఘనంగా జరిగాయి. కైకలూరు సంత మార్కెట్, ఆటపాక రామాలయం, వెలంపేట, దానిగూడెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధనలు జరిగాయి. కుమారి థియేటర్ వెనుక మూడో వార్షికోత్సవం ముగింపు సందర్భంగా వినాయకుడిని డీజే సౌండ్స్‌తో భారీగా ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముంగర నరసింహా, జయమంగళ అంజిబాబు, ఆకుల అనిల్, చరణ్, చందు, బి.శ్యామ్‌బాబు, సాయి, చక్రధర్, గండి సాయి, నాగరాజు, తుపాకుల తరుణ్ పాల్గొన్నారు.

గణేష్ లడ్డూలకు వేలం పాట

గుడ్లవల్లేరు: స్థానిక బాల వినాయక కమిటీ వారు నవరాత్రుల్లో స్వామి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాలను బుధవారం వేలం పాటలు నిర్వహించారు. కూజా ఆకారంలో ఉన్న ఐదు కిలోల లడ్డూను రూ.6వేలకు నందు పాడారు. ఆ తర్వాత లడ్డూ ప్రసాదాల వేలం పాటల్లో పోటాపోటీగా భక్తులు దాదాపు ఆరు లడ్డూలను పాడి తమ సొంతం చేసుకున్నారు.

పేదల దేవుడు వైఎస్సార్

వైఎస్సార్‌కు ఘన నివాళి



పమిడిముక్కల: పేదల దేవుడు వైఎస్సార్ అని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం, వీరంకిలాకు, పమిడిముక్కల, కృష్ణాపురం, ఐనపూరు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పూలమాలేసి నివాళులర్పించారు. వీరంకిలాకు శిరీషా రిహాబిలిటేషన్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గొర్కెపూడి బుజ్జి ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.